సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



ట్రిపుల్ఐటీ ప్రవేశాలకు..

నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ఐటీల్లో మిగిలిన సీట్ల భర్తీకి శుక్రవారం రెండో జాబితాను విడుదల చేయనున్నారు. 8లో ▸



వలంటీర్ల సేవలు భళా

వలంటీర్లు అంకితభావంతో సేవలందిస్తున్నారు. లబ్ధిదారులు స్థానికంగా లేకున్నా వారి వద్దకే స్వయంగా వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. 8లో ▸



చురుగ్గా పారిశుద్ధ్య పనులు

నరసాపురం రూరల్: కొత్తనవరసపురం ఎస్టీకాలనీలో వరద నీరు పూర్తిగా తగ్గడంతో గురువారం ఈవోపీఆర్డీ ఆంజనేయశర్మ పర్యవేక్షణలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

న్యూస్‌రీల్

భీమవరం కమిషనర్‌గా శ్యామల



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీ రెగ్యులర్ కమిషనర్‌గా ఎస్.శ్యామల గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో ఇదే మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేసి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ఎస్.శివరామకృష్ణ ఇక్కడకు కమిషనర్‌గా వచ్చారు. ఇటీవల ఆయన ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించి ఆస్తుల కేసులో జైలుకు వెళ్లడంతో కొంతకాలం తణుకు మున్సిపల్ కమిషనర్ సుధాకర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. ఇప్పుడు శ్యామల కమిషనర్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు.

వేల్పూరు పంచాయతీలో డీపీఓ విచారణ



విచారణ చేస్తున్న డీపీఓ మల్లికార్జునరావు

తణుకు టౌన్: వేల్పూరు గ్రామ పంచాయతీ పాలకవర్గం చేసిన అవకతవకలను పరిశీలించి నివేదిక తయారు చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు తెలిపారు. గురువారం వేల్పూరులో పంచాయతీలో విచారణకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ పాలకవర్గం ఉపాధి హామీ కూలీలతో పారిశుద్ధ్య పనులను చేయించి పంచాయతీలో ఖర్చులు రాసుకోవడం, బ్లీచింగ్ కొనుగోలు, పొక్లయిన్‌తో పనులు, పంచాయతీ తీర్మానాలు లేకుండానే గ్రామంలో కల్వర్టుల నిర్మాణాలు చేపట్టడం, రూ.5 వేలు పైబడిన ఖర్చులను ఎంబుక్ లేకుండా ఖర్చులు రాయడం వంటి వాటిపై ఫిర్యాదులు అందాయన్నారు. వీటిలో లోపాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందాన్ని నియమిస్తున్నామని, బృంద నివేదిక ఆధారంగా కలెక్టర్ చర్యలు తీసుకుంటారన్నారు. ఎంపీటీసీ సభ్యులు చంద్రు శ్యామల, ఐశెట్టి శేషుకుమారి, గుణ్ణం విజయదుర్గ, కత్తుల జస్పాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు నున్న దుర్గాప్రసాద్, పంచాయతీ సభ్యుల ఫిర్యాదు మేరకు సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, ఉప సర్పంచ్ గుణ్ణం రాజారావుతో పాటు ఇతర పంచాయతీ సభ్యుల వివరాలను రికార్డు చేసుకున్నామన్నారు. పంచాయతీ రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. డ్వామా పీడీ ఎస్టీవీ రాజేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీడీ బడుగు వీరాస్వామి, డీఎల్‌పీఓ బలరామరాజు, ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ పి.రామప్రసాద్ పాల్గొన్నారు. విచారణ నేపథ్యంలో గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు.

ఏలూరు డీఈఓ బృందానికి ప్రథమ స్థానం



మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి బహుమతి అందుకుంటున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విజయవాడలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ నేతృత్వంలోని బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు వివరాలను డీఈఓ కార్యాలయం నుంచి విడుదల చేశారు. విజయవాడలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈజ్ ఆఫ్ లివింగ్, గుడ్ గవర్నెన్స్ అనే అంశంపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో 6 అంశాలపై రైటప్స్ రూపొందించడంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఏలూరు డీఈఓ నేతృత్వంలోని బృందానికి ప్రథమ స్థానం లభించింది. జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు, రాఘవాపురం హైస్కూల్ హెచ్ఎం కె.రామకృష్ణ, నలుగురు అవార్డీ టీచర్లు పాల్గొన్నారు.

తమ్మిలేరు నుంచి నీరు విడుదల

చాట్రాయి: తమ్మిలేరు రిజర్వాయర్‌తో మండలంలోని పంట పొలాలకు మేలు కలుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ చెలికాని బాబ్జీ అన్నారు. మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ గోనెల వాగు నుంచి రైతులతో కలసి ఆయన గురువారం సాగునీరు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉండటంతో ఈ ఏడాది పంటలకు ఢోకా ఉండదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఇంటికే పోషకాహారం.. అంతటా సంతోషం

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు

- ఈనెల నుంచి పంపిణీ ప్రారంభం
- 10 రకాల సరుకుల అందజేత
- గర్భిణులు, బాలింతలకు వరం
- జిల్లాలో 16,820 మందికి మేలు

భీమవరం (ప్రకాశం చౌక్): రాష్ట్రంలో బాలింతలు, గర్భిణులకు మేలు చేసేలా ప్రభుత్వం ఇంటికే పోషకాహారం కార్యక్రమం చేపట్టింది. వారి ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ–టేక్ హోమ్ రేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీకి చర్యలు తీసుకున్నారు. దీంతో బాలింతలు, గర్భిణుల ఇంటి వద్దకే అంగన్‌వాడీ సిబ్బంది వచ్చి పోషకాహారం అందిస్తున్నారు. నెలకు సరిపడే పది రకాల సరుకులను కిట్ రూపంలో అందిస్తున్నారు. టేక్ హోమ్ రేషన్ కార్యక్రమం బుధవారం ప్రారంభం కాగా గురువారం నుంచి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా బాలింతలు, గర్భిణులకు పోషకాహారం అందిస్తున్నారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

'పది'ంతల పోషకాహారం : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు పది రకాల పోషకాహార సరుకులు అందిస్తున్నారు. ఒక్కొక్కరికీ 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, 500 గ్రాముల ఆయిల్, 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, 2 కిలోల రాగి పిండి, కిలో అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఖర్జూరం, 250 గ్రాముల చిక్కీలు అందిస్తున్నారు. మార్కెట్‌లో వీటి విలువ సుమారు రూ.850కు పైగా ఉంటుంది. వీటిని ఉచితంగా ఇంటి వద్దకే తీసుకువచ్చి అందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



భీమవరంలో పోషకాహారం అందజేస్తున్న దృశ్యం



ఆకివీడు మండలం తరటవ గ్రామంలో..

నెలకు అందించే సరుకులు

జిల్లాలోని 16280 మంది లబ్ధిదారులకు నెలకు బియ్యం 48,840 కిలోలు, కందిపప్పు 16,280 కిలోలు, ఆయిల్ 8,140 లీటర్లు, పాలు 81,400 లీటర్లు, గుడ్లు 4,20500, రాగిపిండి 32,560 కిలోలు, అటుకులు 16,280 కిలోలు, ఖర్జూరం 4,070 కిలోలు, చిక్కీలు 4,070 కిలోలు, బెల్లం 4,070 కిలోలు అందిస్తున్నారు.

జిల్లాలో మండలాల వారీగా..

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	బాలింతలు, గర్భిణులు
భీమవరం	87	795
భీమవరం అర్బన్	31	710
పెనుమంట్ర	69	725
పాలకొల్లు	78	414
పాలకొల్లు అర్బన్	25	432
తణుకు	55	503
తణుకు అర్బన్	37	692
మొగల్తూరు	84	815
ఆకివీడు	64	722
తాడేపల్లిగూడెం	89	845
తాడేపల్లిగూడెం అర్బన్	60	750
నరసాపురం	89	825
నరసాపురం అర్బన్	20	415
పోడూరు	70	446
యలమంచిలి	85	505
పెనుగొండ	71	841
ఆచంట	71	750
ఇరగవరం	71	634
అత్తిలి	70	633
కాళ్ల	63	550
పాలకోడేరు	66	667
వీరవాసరం	74	670
పెంటపాడు	74	695
గణపవరం	64	520

20 మండలాల పరిధిలో..

జిల్లాలోని 20 మండలాల్లో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో బాలింతలు 7,388, గర్భిణులు 8,996 మొత్తం 16,280 మంది ఉన్నారు. భీమవరం, పాలకొల్లు, తణుకు, మొగల్తూరు, తాడేపల్లిగూడెం, ఆకివీడు, పెనుమంట్రలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి.

చాలా సంతోషం



ఇంటికే పౌష్టికాహారం అందించడం చాలా సంతోషంగా ఉంది. ఈ సౌకర్యం నాలాంటి గర్భిణులకు మేలు చేస్తుంది. గర్భిణులు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని సీఎం సార్ ఆలోచన చేసి నెలకి సరిపడే సరుకులకు అందించడం చాలా బాగుంది.

– పితాని మణి దీపిక, భీమవరం

నాణ్యంగా సరుకులు



బాలింతలు, గర్భిణులకు 10 రకాల పోషకాహారం అందించడం చాలా బాగుంది. ప్రభుత్వం ఇచ్చే పోషకాహార కిట్‌లో సరుకులు నాణ్యతగా, రుచిగా ఉన్నాయి. మా ఆరోగ్యం, మా బిడ్డల ఆరోగ్యం కోసం కూడా జగనన్న ఆలోచన చేసి పోషకాహారం అందించడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

– నిమ్మల వందన, విస్సాకోడేరు

విజయవంతంగా అమలు



జిల్లాలో బాలింతలు, గర్భిణులకు ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్నాం. ఫేస్‌యాప్ ద్వారా ఫొటోలు తీసుకుని వారికి హోమ్ రేషన్ అందిస్తున్నాం. సీడీపీఓలు, సూపర్‌వైజర్లను సమన్వయం చేసుకుని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

– ఎం.సుజాతరాణి, మహిళ, శిశు సంక్షేమ అధికారి, భీమవరం

జగనన్న సురక్షకు అపూర్వ స్పందన

మంత్రులు కొట్టు, కారుమూరి



కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ సీఎం



కారుమూరి నాగేశ్వరరావు, మంత్రి

తాడేపల్లిగూడెం అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి సేవలు అందించారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంలో జిల్లాలో తాడేపల్లిగూడెం నియోజకవర్గం ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15,004 సచివాలయాల పరిధిలో 1,46,27,905 కుటుంబాలను సర్వే చేసి 93 లక్షల 50 వేల అభ్యర్థనలకు ధ్రువీకరణ పత్రాలు అందించారన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 84,811 ధ్రువీకరణ పత్రాలు అందించారన్నారు.

అ'ద్వితీయ'ం

తణుకు అర్బన్: అర్హులందరికీ సంక్షేమాన్ని అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్ చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సురక్ష కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా రెండో స్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. దేశ చరిత్రలో జగనన్న సురక్ష చారిత్రాత్మకంగా నిలిచిందన్నారు. కార్యక్రమం విజయవంతానికి అధికార యంత్రాంగం కష్టపడి పనిచేసిందన్నారు.

● ముఖ్యమంత్రితో భేటీ



తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, గుడాల గోపి మర్యాదపూర్వకంగా కలిశారు. – సాక్షి అమరావతి

పోలీసుల బాహాబాహీ

ఏలూరు టౌన్: నగరంలోని రహదారిపై ట్రాఫిక్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుల్ బాహాబాహీకి దిగడం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ వాహనాలు ఆపి జరిమానాలు విధిస్తున్నారు. అదేసమయంలో తూర్పుగోదావరి జిల్లా సమిశ్రగూడెంలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ తన బంధువుతో కలిసి మోటారు సైకిల్‌పై వెళుతున్నారు. తాను కానిస్టేబుల్ అని చెప్పగా ఐడీ కార్డు చూపించాలనీ, లేకుంటే బండి కదలనివ్వనని ట్రాఫిక్ కానిస్టేబుల్ అన్నారు. అలాగే మోటారు సైకిల్ తాళాలు తీసుకునే ప్రయత్నం చేయగా మహిళా కానిస్టేబుల్ అతడి చేతిని పక్కకు తోసింది. వెంటనే ఆగ్రహంతో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆమె మూతిపై కొట్టటంతో రక్తం వచ్చిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మహిళా కానిస్టేబుల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయబోతుండగా అధికారులు, నాయకులు వారి మధ్య సయోధ్య కుదిర్చినట్టు తెలిసింది.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



ఇళ్ల పట్టాలు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

కాళ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందుతున్నాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. కోలనపల్లిలో గురువారం పట్టాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. పెదఅమిరం గ్రామానికి చెందిన 233 లబ్ధిదారులకు మండలంలోని కోలనపల్లిలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ఈ మేరకు ఇంటి పట్టాలను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన చరిత్ర వైఎస్సార్ కుటుంబానికే ఉందన్నారు. ప్రతిపక్షాలు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వటానికి ఇష్టపడటం లేదని, దీనిని ప్రజలంతా గమనించాలన్నారు. గత టీడీపీ పాలనలో పేదలకు సెంటు భూమి కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు సీఎం జగన్ పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ప్రజలంతా సంక్షేమం, అభివృద్ధికి పట్టం కట్టి జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రి చేయాలన్నారు. సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలందరికీ సంపూర్ణ న్యాయం జరుగుతుందని, ప్రతి కుటుంబానికీ సంక్షేమ లబ్ధి చేకూరుతుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యానారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన 1,234 రేషన్ కార్డులను మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలకు సొమ్ములు ఇస్తేనే రేషన్ కార్డుకు అర్హులుగా గుర్తించేవారని, తహసీల్దార్ సంతకం లేకుండానే రేషన్‌కార్డులు మంజూరు చేసి అవినీతికి పాల్పడిన ఘటనలు కూడా అప్పట్లో ఉన్నాయన్నారు. 2019లో ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణస్వీకారం అనంతరం పారదర్శకంగా నవరత్నాల పథకాలు ప్రజలందరికీ అందిస్తున్నారన్నారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి అర్హులకు రేషన్ కార్డులు అందిస్తున్నారన్నారు. చంద్రబాబు అవినీతిని, సీఎం జగన్ నీతివంతమైన పాలనను బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. విద్యారంగంలోనూ సీఎం జగన్ మార్పులు చేశారని టోఫెల్ పరీక్షలకు సర్కారీ బడుల్లో శిక్షణ ఇస్తున్నారన్నారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉండగా కె.పెంటపాడు, పడమర విప్పర్రు రోడ్డును వేయించానని, మళ్లీ ఇన్నాళ్లకు రూ.10 కోట్లతో ఆ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. కె.పెంటపాడు నుంచి ఆకుతీగపాడు వరకు రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

చంద్రబాబు డ్రామాలు నమ్మొద్దు

2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో రూ.2,64,451 కోట్లు అప్పులు చేస్తే 2019 నుంచి 2023 వరకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.1,77,991 కోట్లు అప్పు తీసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి పార్లమెంటు సాక్షిగా ప్రకటించారని మంత్రి కొట్టు అన్నారు. టీడీపీ తీసుకున్న అప్పు ఏవిధంగా ఖర్చులు చేశారో ప్రజలకు తెలపాలని ప్రశ్నించారు. 2024లో అధికారంలోకి రావడానికి ఇప్పటి నుంచే చంద్రబాబు కొత్త డ్రామాలు ఆడుతున్నాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కొట్టు అన్నారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, తహసీల్దార్లు యడ్ల దుర్గాకిషోర్, శేషగిరిబాబు, నాయకులు కర్రి భాస్కరరావు, గుండుబోగుల నాగు, కొలుకులూరి ధర్మరాజు, వెలిశెట్టి నరేంద్రకుమార్, గుండుమోగుల సాంబయ్య, భావన ధాన్యలక్ష్మి పాల్గొన్నారు.

కొబ్బరి.. ధర తడబడి

- మందగించిన ఎగుమతులు
- రోజుకు 100 నుంచి 30 లారీలకు పడిపోయిన వైనం
- తమిళనాడులో అధిక దిగుబడుల ప్రభావం
- జిల్లాలో 25 వేల ఎకరాల్లో తోటలు




వీరవాసరం మండలం పంజా వేమవరంలో కొబ్బరికాయలు ఒలుస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: వరదలు, తమిళనాడులో అధిక దిగుబడుల కారణంగా స్థానికంగా కొబ్బరి ఎగుమతులు మందగించాయి. ప్రస్తుతం మార్కెట్ ధరల ప్రకారం రైతులకు వెయ్యి పచ్చి కొబ్బరి కాయలకు రూ.6,500, పాత కాయలకు రూ.8,500 వరకు వ్యాపారులు చెల్లిస్తున్నారు. జిల్లాలో వరి సాగు తర్వాత ఆదాయం ఇచ్చే పంటల్లో కొబ్బరి ప్రధానమైంది. జిల్లాలో ప్రధానంగా పాలకొల్లు, పరిసర ప్రాంతాల్లో కొబ్బరి వ్యాపారం, ఎగుమతులపై ఆధారపడి వేలాది మంది జీవిస్తున్నారు. జిల్లాలో సుమారు 25 వేల ఎకరాల్లో కొబ్బరి తోటలు ఉండగా పుంత గట్లు, ప్రభుత్వ, పోరంబోకు భూములు, రోడ్ల వెంబడి వేలాది కొబ్బరి చెట్లు పెంచుతున్నారు.

తమిళనాడులో పెరిగిన కొబ్బరి దిగుబడులు

గతంలో జిల్లా నుంచి మహారాష్ట్ర, రాజస్థాన్, ఒడిసా, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక తదితర రాష్ట్రాలకు కొబ్బరి ఎగుమతి అయ్యేది. రోజూ సుమారు 100 లారీల్లో దాదాపు రూ.30 లక్షల ఎగుమతులు జరిగేవి. దీంతో కొబ్బరి ఒలుపు, నాణ్యత పరిశీలన, ఎగుమతులు వంటి పనులపై ఆధారపడి సుమారు 30 వేల మంది కార్మికులు ఉపాధి పొందేవారు. అయితే జిల్లాలో కొబ్బరికి తెగుళ్లు ఆశించడంతో దిగుబడులు తగ్గాయి. అలాగే కొబ్బరి దింపు, ఒలుపు వంటి ఖర్చులు కూడా పెరిగాయి. దీంతో గతంలో ఏటా పదిసార్లు కొబ్బరి దింపులు తీసే రైతులు ప్రస్తుతం ఆరేడు దింపులకే పరిమితమవుతున్నారు. దీనికితోడు తమిళనాడులో కొబ్బరి దిగుబడులు పెరగడం వాటి నాణ్యత, సైజు బాగుండటంతో మన కాయలకు గిరాకీ తగ్గి ధర పతనమైంది. అలాగే ఆషాఢం, అధిక శ్రావణ మాస ప్రభావంతో శుభకార్యాలు, పండుగలు లేకపోవడం కూడా ధరల తగ్గుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం జిల్లా నుంచి రోజుకు 30 లారీలు మాత్రమే కొబ్బరి ఎగుమతులు ఉన్నాయని చెబుతున్నారు.

మన కాయలకు గిరాకీ తగ్గింది



తమిళనాడు కొబ్బరి నాణ్యత, సైజ్ విషయంలో మన కాయల కంటే బాగుంటున్నాయి. దీంతో ఇతర రాష్ట్రాల్లోని వినియోగదారులు వీటిపై మక్కువ చూపుతున్నారు. అలాగే ఇక్కడ కొబ్బరి ఒలుపు, ఎగుమతుల ఖర్చులు కూడా పెరిగాయి. దీంతో రైతులకు వెయ్యి పచ్చి కాయలకు రూ.6,500 మాత్రమే ఇవ్వగలుగుతున్నాం.

– గంధం త్రినాథులు, కొబ్బరి వ్యాపారి, మేడపాడు

దిగుబడులూ తగ్గాయి



కొబ్బరి దిగుబడులతో పాటు ధరలు కూడా తగ్గడంతో ఇబ్బంది పడుతున్నాం. గతంలో ఏటా 10 సార్లు కొబ్బరికాయల దింపులు తీస్తే ఇపుడు ఆరేడు దింపులకు పరిమితం కావాల్సి వస్తోంది. ధరలు తగ్గడంపాటు దింపు, ఒలుపు ఖర్చులు కూడా పెరిగాయి. దీంతో గతంలో కొబ్బరిపై ఉన్న మక్కువ ప్రస్తుతం రైతుల్లో సన్నగిల్లుతోంది.

– తేలి జోషెఫ్‌రవికుమార్, రైతు, దిరుసుమర్రు

పక్కాగా వరద సహాయక చర్యలు



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): గోదావరి వరద తగ్గి యథాస్థితికి వచ్చే వరకు పునరావాస కేంద్రాలు, సహాయక కార్యక్రమాలు, వైద్య శిబిరాలను పక్కాగా నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. తాడేపల్లి కార్యాలయం నుంచి గురువారం ఆయన వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. విశాఖలో ఎన్నికల సంఘ సమావేశానికి హాజరైన కలెక్టర్ పి.ప్రశాంతి అక్కడ నుంచి, భీమవరం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ వరద బాధిత కుటుంబాలందరికీ సాయం అందించాలని, నేను నష్టపోయానని కాని.. నాకు ప్రభుత్వ సాయం అందలేదని గాని ఒక్క ఫిర్యాదు కూడా అందకూడదన్నారు. వరద నీరు తగ్గిన తర్వాత నష్టం అంచనాలు సిద్ధం చేయాలన్నారు. మా జిల్లా కలెక్టర్ బాగా చూసుకున్నారు అనే మాట బాధితుల నుంచి వినిపించాలని, ప్రభుత్వానికి మంచి పేరుతేవాలని సూచించారు.

ఆపద వేళ.. వలంటీర్ల సేవలు భళా

'జగనన్న మాపై ఉంచిన నమ్మకంతో మాపై పెట్టిన బాధ్యతను ఎన్ని కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా ముందడుగు వేస్తాం' అంటున్నారు వలంటీర్లు. ప్రతి నెలా ఒకటో తేదీ వచ్చిందంటే లబ్ధిదారులు ఎక్కడ, ఏ పరిస్థితుల్లో, ఎంత దూరంలో ఉన్నా వలంటీర్లు ఆయా ప్రాంతాలకు వెళ్లి లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేస్తూ తమ సేవాగుణాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం అందించే పింఛన్ ఏదోక రూపంలో వారికి ఆర్థిక అవసరాలకు ఉపయోగప డుతుందనే భావనతో ప్రయాణం కష్టమైనా వలంటీర్లు వెనుకడుగు వేయడం లేదు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ సేవలను ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. గతంలో పంచాయతీ కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి క్యూలో నిరీక్షించి పింఛను సొమ్ము తీసుకునేవారమని, కానీ వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎక్కడ ఉన్నా చెంతకే వలంటీర్లు వచ్చి మరీ పింఛన్ సొమ్ము ఇస్తున్నారని, వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

- దూరంగా ఉన్నా.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నా పింఛన్ల అందజేత
- వలంటీర్ల సేవలను ప్రశంసిస్తున్న లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు


ఏలూరులో భీమవరపు శేషుకు పింఛను అందిస్తున్న వలంటీర్ సవలం నాగవీరవెంకట సత్యనారాయణ


భీమవరం ఆసుపత్రిలో రూతమ్మకు పింఛన్ ఇస్తున్న ఎన్నార్పీ అగ్రహారం వలంటీర్ మమత


పెద్దేవంలో యర్రమల్లి అమ్మాజీకి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటరమణ


భీమవరం ఆసుపత్రిలో మునగాల కుమారికి పింఛను అందిస్తున్న వలంటీర్ పాపారావు


కంసాలిపాలెంలో వృద్ధురాలు నాగరత్నంకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ దుర్గ


ఏలూరు ఆసుపత్రిలో చిటికెన గాంధీకి పింఛను అందిస్తున్న ఉణుదుర్రు వలంటీర్ లిల్లీరోజా


నరసాపురం ఆసుపత్రిలో నాగేశ్వరరావుకు పింఛన్ సొమ్ము ఇస్తున్న వలంటీర్ సుబ్బలక్ష్మి

ఉండి : ఉణుదుర్రుకు చెందిన దివ్యాంగుడు చిటికెన గాంధీ అనారోగ్యంతో గత కొంతకాలంగా ఏలూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ యు.లిల్లీరోజా గురువారం ఏలూరు వెళ్లి గాంధీకి పింఛను సొమ్ము అందించింది. అలాగే మహదేవపట్నంకు చెందిన మునగాల కుమారి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ప్రభుత్వం ప్రతి నెలా అందిస్తున్న పింఛను సొమ్ము రూ.10 వేలు ఆమెకు ఎంతో ఆసరాగా ఉంటోంది. కొద్దిరోజులుగా భీమవరంలో చికిత్స పొంది మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆస్పత్రిలో చేరింది. ఆమె ఎక్కడుంటే అక్కడకు వెళ్లి ప్రతి నెలా వలంటీర్ ఎస్.ప్రసాద్ పింఛను సొమ్ము అందిస్తున్నారు. గురువారం ప్రసాద్ పింఛను సొమ్ము అందించడంతో అతనికి కృతజ్ఞతలు తెలిపింది. అదేవిధంగా ఎన్నార్పీ అగ్రహారానికి చెందిన దేశాబత్తుల రూతమ్మ కొద్దిరోజులుగా అనారోగ్యం కారణంగా భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ ముళ్లగిరి మమత గురువారం ఆస్పత్రికి వెళ్లి రూతమ్మ పింఛను సొమ్ము అందించింది.

వృద్ధులకు ఆసరాగా..

మొగల్తూరు : పంచాయతీ నక్కావారిపాలెంకు చెందిన కవురు నాగేశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రతి నెలా పింఛను అందజేసే వలంటీర్ ఇంజేటి సుబ్బలక్ష్మి నరసాపురం ఆసుపత్రిలో నాగేశ్వరరావు చికిత్స పొందుతున్నట్లు తెలుసుకుంది. గురువారం ఆసుపత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛను అందజేసింది.

పెద్దేవంలో కుమార్తె ఇంటికి వెళ్లి..

పోలవరం రూరల్ : పోలవరం గ్రామానికి చెందిన యర్రమల్లి అమ్మాజీ అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకున్న అనంతరం పెద్దేవం గ్రామంలో కుమార్తె వద్ద ఉంటోంది. ఈమెకు పోలవరం-1 సచివాలయం వలంటీర్ ముంగర వెంకట రమణ గురువారం పెద్దేవం వెళ్లి ఆమెకు వృద్ధాప్య పింఛను అందజేశారు.

ఏలూరు ఆస్పత్రికి వెళ్లి..

భీమడోలు : భీమడోలులో భీమవరపు శేషు అనే వృద్ధుడు తనకు కాళ్లకు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని అక్కడే వార్డులో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ సవలం నాగవీర వెంకట సత్యనారాయణ విషయం తెలుసుకుని గురువారం ఏలూరు ఆసుపత్రికి వెళ్లి శేషుకు వృద్ధాప్య పింఛను సొమ్ము అందించాడు.

కంసాలిపాలెం వెళ్లి..

తణుకు : ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు గ్రామానికి చెందిన వృద్ధురాలు గాలింకి నాగరత్నం అనారోగ్యం కారణంగా ఇటీవల నిడదవోలు మండలం కంసాలిపాలెంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. విషయం తెలుసుకున్న వలంటీర్ కె.దుర్గ గురువారం కంసాలిపాలెం వెళ్లి నాగరత్నంకు పింఛను సొమ్మును అందించింది.

క్లుప్తంగా


భర్త, అత్తమామలపై కేసు

భీమడోలు: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై ఓ వివాహిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై చావా సురేష్‌కుమార్ గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పూళ్లకు చెందిన గెడ్డం సహదేవుడుతో ద్వారకాతిరుమల మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన స్వప్నకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు కలగలేదు. దీంతో భర్త గెడ్డం సహదేవుడు తాను వేరే పెళ్లి చేసుకుంటానని, అదనపు కట్నం తేవాలని చెప్పి భార్య స్వప్నను పుట్టింటి వద్ద వదిలేశాడు. దీంతో స్వప్న పోలీసులను ఆశ్రయించగా, ఆమె ఫిర్యాదు మేరకు భర్త సహదేవుడు, అత్త గొంతెమ్మ, మామ బాలరాజులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రుణాలిస్తామంటూ టోకరా

ముదినేపల్లి రూరల్: రుణాలిస్తామంటూ పలువురి నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన సంస్థపై బాధితులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఆటోనగర్‌లో ఒక ఇంటిని కొందరు అద్దెకు తీసుకుని హోంఫైనాన్స్ పేరిట కార్యాలయాన్ని ప్రారంభించారు. ఒకొక్కరి నుంచి ఆధార్ కార్డు ఆధారంగా రూ.5 వేలు కట్టించుకుని కేవలం 70 పైసల వడ్డీకే రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు రుణాలు ఇస్తామని నమ్మబలికారు. ఈ విధంగా 15 రోజుల క్రితం కొందరి నుంచి డబ్బులు వసూలు చేశారు. తరువాత రుణాల గురించి ఆరా తీస్తే సంబంధిత వ్యక్తులెవ్వరూ కార్యాలయంలో కనిపించక పోవడంతో పాటు ఫోన్లు స్విచాఫ్ చేసినట్లు మండలంలోని పెయ్యేరుకు చెందిన బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంస్థ మండలంలోని వడాలి, వణుదుర్రు, కొరగుంటపాలెం, గురజ తదితర గ్రామాల్లో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల లబ్ధిదారుల నుంచి కూడా ఇదే తరహాలో రుణాలిస్తామంటూ డబ్బులు వసూలు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు నేడు రెండో జాబితా విడుదల



నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలకు సంబంధించి తొలి విడత నిర్వహించిన కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి గాను శుక్రవారం రెండో జాబితాను విడుదల చేయనున్నట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు గురువారం తెలిపారు. ఉదయం పది గంటలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఎంపిక జాబితాను ఉంచుతామని, జాబితాలో ఉన్న అభ్యర్థులు కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అంతేగాకుండా ఎంపిక జాబితాలో ఉన్న అభ్యర్థులకు ఎస్ఎంఎస్‌లు, మెయిల్‌కు మెసేజ్ పంపించడం జరుగుతుందన్నారు. మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయిన అనంతరం నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి మొత్తం 765 సీట్లు మిగిలిన నేపథ్యంలో ఈ సీట్ల భర్తీకి గాను రెండో విడత కౌన్సెలింగ్‌ను ఈ నెల 9, 10 తేదీల్లో నాలుగు ట్రిపుల్ ఐటీలకు కలిపి నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అలాగే ఈ నెల 11న నుంచి అన్ని ట్రిపుల్ ఐటీల్లో పీయూసీ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

పేదలకు సంక్షేమం దక్కకుండా అడ్డుకుంటున్నారు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


వేల్పూరులో బీసీల ఆత్మగౌరవ సభలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: రాష్ట్రంలో టీడీపీ నాయకులు పేదలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందకుండా రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో 22 వేల కేసులు వేసి అడ్డుకుంటున్నారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. గురువారం రాత్రి తణుకు రూరల్ మండలం వేల్పూరులో నిర్వహించిన బీసీ కులాల ఆత్మ గౌరవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ వేల్పూరులో గత 30 ఏళ్లుగా ఎవరి ఓట్లతో రాజకీయ జీవితాన్ని అనుభవించారో వారే నేడు బీసీల కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలను నిలుపుదలే చేసేలా కోర్టులకెళ్లి స్టేలు తీసుకొచ్చారన్నారు. టీడీపీ నాయకులు రాష్ట్రంలో బీసీలను ఓట్లేసే యంత్రాలుగానే వాడుకున్నారే తప్ప వారి అభివృద్ధికి ఏమీ చేయలేదన్నారు. గ్రామంలోని బీసీలకు సొంతంగా కమ్యూనిటీ హాళ్లు నిర్మించుకుంటే స్థానిక టీడీపీ నాయకులు ఈర్షతో అడ్డుకుంటున్నారని చెప్పారు.

ఒక్క వేల్పూరులోనే రూ.1500 కోట్ల దోపిడీ

గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన వేల్పూరుకు చెందిన ఆరిమిల్లి రాధాకృష్ణ గ్రామంలో సుమారు 300 ఎకరాల రియల్ ఎస్టేట్ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన రూ.1,500 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. ఒక్క వేల్పూరులో ఇలా ఉంటే మొత్తం నియోజకవర్గంలో ఎంత అవినీతి చేసి దోచుకున్నారో ప్రజలు గ్రహించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే వినీతి చిట్టా తన వద్ద ఉందన్నారు. ఈ గ్రామంలో 2009లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే వంతెలు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లకు స్థలాలు ఇచ్చానన్నారు. బైపాస్ రోడ్డుకు కూడా తాను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాతనే కాంట్రాక్టర్లకు సొమ్ములు చెల్లించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలో వున్న రూ.3 కోట్లతో రూ.1 కోటి 50 లక్షలతో శెట్టి బలిజ, అగ్నికుల క్షత్రియ, రజక, నాయీ బ్రాహ్మణ, తాపీ మేస్త్రీలు, టైలర్స్‌కు కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలంటే గ్రామ పంచాయితీ సర్పంచ్‌ను అడ్డుపెట్టుకుని నిధులు రాకుండా కోర్టులో కేసులు వేసి బీసీలను వేధిస్తున్నారని చెప్పారు. టీడీఆర్ బాండ్లలో అవినీతి జరిగిందని విమర్శించే టీడీపీ నాయకులు వేల్పూరులో రియల్ ఎస్టేట్‌లో ఆరిమిల్లి రాధాకృష్ణ, అతని అనుచరులు చేసిన అవినీతిని చర్చించేందుకు సిద్ధమా అని ప్రశ్నించారు. గ్రామంలో రైస్ మిల్లర్లు ప్రజల నుంచి అప్పులు తీసుకుని ఎగవేస్తే టీడీపీ నాయకులు వాటిని వసూలు చేసి ప్రజలకు చెల్లించారా? అని ప్రశ్నించారు. గత ఏడు రోజులుగా వేల్పూరులో రిలే దీక్షలు చేస్తున్న బీసీ నాయకులకు సంఘీభావం తెలిపి వారికి ఇమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ పెండ్రా వీరన్న, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, జిల్లా ఎస్సీ సెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పెన్మత్స రామరాజు, తణుకు నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జక్కంశెట్టి సత్య రాజేంద్ర ప్రసాద్, పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై నిరసనల హోరు



మణిపూర్ ఘటనలపై పశ్చిమగోదావరి జిల్లాలో నిరసనల జోరు కొనసాగుతోంది. గురువారం పలు చోట్ల భారీ శాంతి ర్యాలీలు, కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహించారు.
– సాక్షి నెట్‌వర్క్

పెంటపాడు: తాడేపల్లిగూడెంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ జేఏసీ సంఘాలు



ఉండి : ఉండి ప్రధాన సెంటర్‌లో భారీ శాంతి ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

పవన్‌కు ఓటేస్తే.. మురికి కాలువలో వేసినట్టే !


జగన్నాథపురంలో మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో చంద్రబాబు వద్ద ప్యాకేజీ తీసుకుంటున్న పవన్ కల్యాణ్‌కు ఓటేస్తే మురికి కాలువలో వేసినట్టేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. గురువారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ పాలనలో రాష్ట్రంలో కరవు తప్ప ఏముందని నిలదీశారు. చంద్రబాబు సింహం కాదని, ఊర సింహమని ఘాటుగా విమర్శించారు. పులివెందులలో ప్రగల్భాలు పలుకుతున్న చంద్రబాబుకు అక్కడ నుంచి పోటీ చేసే అభ్యర్థే లేరని దుయ్యబట్టారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రూ.రెండు లక్షల 67వేల 500 కోట్లు అప్పు చేశారని, వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల మూడు నెలల కాలంలో రూ.1.77 లక్షల కోట్లు అప్పు చేశారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్ వేదికగా చెప్పారని గుర్తు చేశారు. చంద్రబాబు చేసిన అప్పులో ప్రజలకు ఇచ్చిందేమీ లేదని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ చేసిన అప్పులో రూ.2.35 లక్షల కోట్లను నేరుగా సంక్షేమ పథకాల రూపంలో ప్రజల ఖాతాలకు జమ చేయడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాల పేరిట ప్రజల్ని సోమరిపోతులుగా మారుస్తున్నారని దుష్ప్రచారాలు చేశారన్నారు. చంద్రబాబు ఒక్క మాట నిజం చెప్పినా తల వెయ్యి చక్కలైపోతుందని మునిశాపమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే అబద్ధాలు చెప్పుకుంటూ పోతా అనే స్ట్రేటజీలో ముందుకెళ్తున్నాడన్నారు. సిగ్గు కూడా వదిలేశాడని విమర్శించారు. టీడీపీని, చంద్రబాబును నమ్మి ప్రజలు ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు.

అనుమతికి మించి పొగాకు పండించొద్దు

జంగారెడ్డిగూడెం : పొగాకు రైతులు అనుమతికి మించిన పంట పండించడం వల్ల ఇబ్బందులు వస్తాయని ఎస్ఎల్ఎస్ రీజియన్ మేనేజర్ ఆదిశేషయ్య సూచించారు. పొగాకు బోర్డు జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1లో గురువారం ఆయన రైతులతో సమావేశం అయ్యారు. వేలం నిర్వహణాధికారి శ్రీహరి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆదిశేషయ్య మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు అధిక ధరలను చూసి రైతులు ఎక్కువగా సాగు చెయ్యడం కుదరదన్నారు. ఈ ఏడాది కురిసిన అకాల వర్షాలకు, వడగళ్ల వానకు పొగాకు రైతులు పంట నష్టపోగా, పొగాకు బోర్డు 35 క్వింటాల కన్నా అధికంగా పండించిన పొగాకును అపరాధ రుసుము లేకుండా ఆ పంటను కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. వేలం అధికారి శ్రీహరి మాట్లాడుతూ ఈ సంవత్సరం అధిక ధరలను చూసి పొలాలను, బ్యారన్‌లను అధిక రేటుకు కౌలుకు తీసుకుని రైతులు నష్టపోరాదని సూచించారు. వచ్చే ఏడాది మార్కెట్ ఇలా ఉంటుందని చెప్పలేమన్నారు. రాబోయే సీజన్‌కు ఒక్కొక్క బ్యారనుకు 35 క్వింటాళ్లను బోర్డు అనుమతించగా, దానికి మించి పొగాకు పండించి అనధికార బ్యారనులు నిర్మించిన రైతులపై చర్యలు తీసుకుంటామన్నారు. సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ సుధీర్, నాయకులు గడ్డమణుగు సత్యనారాయణ, కరాటం రెడ్డిబాబు, గద్దే లక్ష్మణరావు, వీరభద్రరావు, పిన్నమనేని రాధాకృష్ణ పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాల సొమ్ము స్వాహా కేసులో ఐకేపీ వీవోఏ అరెస్టు

నరసాపురం రూరల్: శ్రీనిధి రుణాల సొమ్ము స్వాహా కేసులో మొగల్తూరు మండలానికి చెందిన ఐకేపీ వీవోఏ మద్దాల సూర్యకుమారిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.వీరబాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పేరుపాలెంసౌత్ పంచాయతీ బెల్లంకొండవారి మెరకకు చెందిన మద్దాల సూర్యకుమారి డ్వాక్రా సంఘాల నుంచి రికవరీ చేసిన శ్రీనిధి రుణాలకు సంబంధించిన సొమ్ములు సుమారు రూ.14,62,176 అవకతవకలకు పాల్పడినట్లు ఐకేపీ అధికారుల విచారణలో తేలిందన్నారు. దీంతో ఏపీఎం మారంపూడి సుబాషిణి ఈ ఏడాది మే 12వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ నిర్వహించగా వీవోఏ అవకతవకలకు పాల్పడినట్లు రుజువు కావడంతో సూర్యకుమారిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థినిని కొట్టిన ఉపాధ్యాయుడిపై కేసు

ఆగిరిపల్లి (నూజివీడు): మండలంలోని ఈదుల గూడెం ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి విద్యార్థినిని గత నెల 31న కొట్టిన ఉపాధ్యాయుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసిన పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు. విద్యార్థిని గూబపై ఉపాధ్యాయుడు గట్టిగా కొట్టడంతో చెవి వినబడటం లేదని విద్యార్థిని ఇంట్లో తల్లిదండ్రులు చెప్పగా, వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్సై తావిర్యా నాయక్ కేసు నమోదు చేసి, విద్యార్థినిని చికిత్స నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచనలతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా

మండల పరిషత్‌లో సామాజిక తనిఖీ ప్రజావేదిక


మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదిక దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్‌శాఖల్లో 1958 పనులకు సంబంధించి రూ.11.30కోట్లతో చేపట్టిన పనులపై తనిఖీ జరిగింది. డ్వామా పీడీ ఎస్టీవీ.రాజేశ్వరరావు, జిల్లా విజిలెన్స్ అధికారిణి విజయలక్ష్మి పర్యవేక్షణలో రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, స్టేట్ రిసోర్స్‌పర్సన్లు పున్నమనాయుడు, సాగర్, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జయంతి జ్యూయలరీలో వజ్రాల ఆభరణాల ఎగ్జిబిషన్


జయంతి జ్యూయలరీలో ఆభరణాలను తిలకిస్తున్న వినియోగదారులు

తణుకు: తణుకు పట్టణంలోని జయంతి డైమండ్స్, జ్యూయలర్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో మూడ్రోజుల పాటు ఎగ్జిబిషన్ కమ్ సేల్స్ నిర్వహిస్తున్నారు. ఈనెల 2న ప్రారంభమైన ఈ ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల నాణ్యమైన వజ్రాలు, ఆభరణాలు విక్రయాలకు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు రమేష్‌జైన్, రాజేంద్ర, యతేంద్రలు తెలిపారు. శుక్రవారం ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాలూరులో పొలంబడి


పాలూరులో జరిగిన పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో రాజేష్

అత్తిలి: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించి సాగు చేయడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. గురువారం అత్తిలి మండలం పాలూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు బ్యాలెట్ పరీక్ష నిర్వహించారు. సార్వాసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తానుకొండ దయామణి, ఉపసర్పంచ్ రాపేటి సింహాచలం, ఎంపీటీసీ రామలింగేశ్వర విష్ణుమూర్తి, వీఏఏ సాహిత్య, రాము, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి


జూనియర్ కళాశాల కావాలని డిమాండ్ చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తాడేపల్లిగూడెం: గూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక గత కొంతకాలంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఒక భవనంలో ఈ కళాశాల కొనసాగుతుందన్నారు. సొంత భవనం మంజూరు చేయకపోతే ఏఐఎస్ఎఫ్ పోరుకు సమాయత్తమవుతుందన్నారు. నాయకులు వి.సాయి కుమార్, టి.అప్పలస్వామి, మర్రి అజయ్, అనంతరం తొమ్మిదిమందితో కళాశాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెత్త నుంచి సంపద సృష్టి

భీమవరం అర్బన్ : తడి, పొడి చెత్త ద్వారా సంపద సృష్టించవచ్చని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. భీమవరం మండలం కొత్తపూసలమర్రులో గురువారం తడి, పొడి చెత్త డబ్బాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇంట్లో వాడిపడేసిన చెత్తను తడి, పొడి డబ్బాల్లో సేకరించి మాగబెట్టడం ద్వారా సారవంతమైన వర్మీ కంపోస్టు తయారవుతుందన్నారు. ఆ కంపోస్టును మొక్కలకు వేస్తే ఆరోగ్యకరమైన పండ్లు, కాయగూరలు కాస్తాయన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నియోజకవర్గంలో ప్రజలకు ఏ సమస్య వచ్చిన సత్వరమే పరిష్కరిస్తూ వారికి అండగా ఉంటున్నారన్నారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలన్నారు. జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు వింటూ.. సంక్షేమాన్ని వివరిస్తూ

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- జగన్నాథపురంలో గడపగడపకు మన ప్రభుత్వం


తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువ చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. గురువారం రాత్రి మండలంలోని జగన్నాథపురం గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామంలో రూ.20లక్షల వ్యయం నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం ఉపముఖ్య మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో జగన్నాథపురం గ్రామంలో ఒకనాడు పెట్రోల్‌కు కూడా డబ్బులు లేని దొంగల ముఠా నేడు తెలంగాణాలో స్థలాలు కొనే స్థాయికి ఎదిగిందని దుయ్యబట్టారు. తెలుగుదేశం ముఠా నేడు రోడ్లు బాగోలేదని రోడ్లెక్కుతున్నారని విమర్శించారు. గురువింద గింజ మాదిరిగా టీడీపీ నాయకులు మాట్లాడుతున్నారన్నారు. గ్రామాల అభివృద్ధికి రహదారులు ప్రధానమన్నారు. తద్వారా పొలాలకు విలువ వస్తుందన్నారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో ఏం చేశామనే ఆలోచన ఏ ఒక్క నాయకుడికి లేదన్నారు. 2022 నుంచి ప్రణాళికలను ప్రారంభించి వందల కోట్లతో రహదారులను అభివృద్ధి చేశామన్నారు. టీడీపీ పాలనలో రాష్ట్రంలో కరవు తప్ప ఏముందని ప్రశ్నించారు. ఇదిలా ఉంటే జగన్ పాలనలో రైతులు ధీమాగా ఉన్నారన్నారు. రైతుకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా సకాలంలో సీఎం జగన్ తీరుస్తారనే నమ్మకం వచ్చిందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసిన వారికే రైతు మద్దతు ఉంటుందన్నారు. చంద్రబాబు మాటలు నీట బుడగ లాంటివని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, సర్పంచ్ ఉంద్రాజవరపు చంద్రిక, ఎమ్పీటీసీలు నార్ని నాగేశ్వరరావు (నాగులు), మార్లపూడి సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు), డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేశ్వర్లు, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, ఈవో శ్రీనివాసరెడ్డి, సచివాలయ కార్యదర్శి జడ్డు ఫణీంద్రకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, సొసైటీ ఛైర్మన్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం


బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : మాతా, శిశు సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం మంత్రి కొట్టు చేతుల మీదుగా పౌష్టికాహార కిట్లను గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ జన్మించిన బిడ్డ ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశ్యంతోనే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారం గర్భిణులు ప్రసవం అనంతరం ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగ పడుతుందన్నారు. దీనిని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదరికం కారణంగా ఎంతో మంది పౌష్టికాహారాన్ని తీసుకోలేకపోతున్నారని తెలిపారు. 25 కోడిగుడ్లు, 3కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరలీటరు నూనె, 2కిలోల రాగిపిండి, ఒక కిలో అటుకులు, వేరుశనగ గుళ్లతో కలిగిన కిట్లను పంపిణీ చేశారు. ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీ సరస్వతి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, సూపర్‌వైజర్ దుర్గా భవాని, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీలు పి శేషులత, దాసరి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాస్టర్‌మైండ్స్ సత్కారం

తాడేపల్లిగూడెం: జూనియర్ ఇంటర్ (2023)ఫలితాలలో గూడెం పట్టణంలోని కళాశాలల్లో చదివిన విద్యార్థుల్లో ప్రతిభ కనపర్చిన వారిని సత్కరించాలని నిర్ణయించినట్టు మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ సిలబస్‌లో ఎంపీసీ గ్రూపులో 470 ఆపై మార్కులు, బైపీసీ గ్రూపులో 400 మార్కులు పైన, ఎంఈసీ గ్రూపులో 470 మార్కులు ఆపైన మార్కులు , సీఈసీ గ్రూపులో 450 ఆపై మార్కులు పొందిన విద్యార్థులను ఈ నెల ఐదో తేదీన ఏలూరు రోడ్డులోని షిర్డీసాయి కల్యాణ మండపంలో సాయంత్రం ఐదు గంటలకు సత్కరించనున్నామని విద్యాసంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు, కాలేజీ ఐడీ కార్డు, జూనియర్ ఇంటర్‌లో సాధించిన మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ)తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 8978480385, 9248722264 నంబర్లను సంప్రదించాలన్నారు. విద్యార్థులకు పురస్కారాలతో పాటు నగదు బహుమతి కూడా ఇస్తామన్నారు.

ఆత్మబంధువుల సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం అర్బన్ : ఆత్మబంధువులు స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న సామాజిక సేవలు అభినందనీయమని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కొనియాడారు. ఆత్మబంధులు సేవా సంస్థ సభ్యులు గురువారం మంత్రి కొట్టుకు మెమొంటోను అందచేశారు. మున్సిపల్ కమిషనర్ డాక్టర్ శామ్యూల్ పాల్గొన్నారు.

బీసీలపై టీడీపీ నాయకుల కక్షపూరిత విధానాలు విడనాడాలి


వేల్పూరులో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న బీసీ నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు టౌన్: వేల్పూరులో బీసీ కులాల పట్ల తెలుగుదేశం నాయకుల కక్ష పూరిత రాజకీయాలను విడనాడాలని రాష్ట్ర శెట్టిబలిజ సంఘం ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ తణుకు నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి సత్య రాజేంద్ర ప్రసాద్ కోరారు. వేల్పూరులో బీసీ కులాలకు సంబంధించిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన నిధులు విడుదల చేయాలని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు నియోజకవర్గంలోని వివిధ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో బీసీలు తమ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన డబ్బులు విడుదల కాకుండా అడ్డుకుంటున్నారని రిలే నిరాహారా దీక్షలు చేపట్టినా వారిలో మాత్రం ఎటువంటి మార్పు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇరగవరం జెడ్పీటీసీ సభ్యుడు వంపన అంజిబాబు, తణుకు మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, ఇరగవరం మండల పార్టీ అధ్యక్షుడు కె దుర్గా ప్రసాద్, వేల్పూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు నున్న దుర్గా ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ బొశెట్టి శేషకుమారి, మహిళా అధ్యక్షురాలు చుండ్రు శ్యామల, ఎంపీటీసీలు రెడ్డి హైమా, విజయ దుర్గ, కనక మహాలక్ష్మీ, పంచాయితీ సభ్యుడు రెడ్డి సత్తిరావు, ఎస్సీ సెల్ నాయకులు తాడిపర్తి రాజశేఖర్, కత్తుల జస్పాల్, తలపాకుల రాము, దారం శ్రీను, కాకరపర్తి ఆంజనేయులు, వివిధ గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్ సమస్యలను పరిష్కరించాలి


తణుకులో మంత్రి కారుమూరికి వినతిపత్రం అందిస్తున్న గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్

తణుకు అర్బన్: పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును మంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఎల్‌పీజీ కొత్త డిస్ట్రిబూటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 350 మంది కొత్త ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్స్ లక్షల్లో పెట్టుబడి పెట్టి కేంద్ర ప్రభుత్వ ఏరియా ఆఫ్ ఆపరేషన్ నిబంధనలకు నోచుకోకుండా ఇబ్బందులు పడుతున్నామని మంత్రి కారుమూరికి వివరించారు. గ్యాస్ సరఫరా చేయుటకు గ్యాస్ కనెక్షన్లు లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఇప్పటికే అధికసంఖ్యలో కనెక్షన్లు ఉన్న పాత డిస్ట్రిబ్యూటర్స్ నుంచి కనెక్షన్లను రేషనైజేషన్ పద్ధతిలో తమకు బదిలీ చేయించాలని కోరారు. మంత్రి కారుమూరి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నూతన గ్యాస్ డిస్ట్రిబ్యూటర్స్ చంద్రశేఖర్, పల్లా విజయలక్ష్మి, వారా శిరీష్‌కుమార్, ఎం.అశోక్‌రాజ్ పాల్గొన్నారు.

తల్లి పాలతో ఆరోగ్యం


తణుకులో తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న డాక్టర్ వెలగల అరుణ

తణుకు అర్బన్: తల్లి పాలు బిడ్డకు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తణుకు ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన బాలింతలకు అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. పుట్టిన శిశువుకు 6 నెలల వయస్సు వచ్చే వరకు తల్లి పాలు తప్పనిసరిగా పట్టాలని సూచించారు. తల్లి పాలు పట్టడం వలన బిడ్డ జీవనకాలం ఎంతో ఆరోగ్యంగా ఉంటుందని, తొలి ముర్రు పాలులో కొలస్ట్రామ్ అనే ఎంజైమ్ ఉంటుందని అది వ్యాధినిరోధక శక్తిని అందిస్తుదని స్పష్టం చేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని శిశువులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ పుష్పాల రాజరాజేశ్వరి, డాక్టర్ గౌతమి, ఎస్ఎన్‌సీయూ డాక్టర్ భాగ్యశ్రీ, డాక్టర్ హర్షిణి, నర్సింగ్ సూపరింటెండెంట్ జాన్‌లిల్లీ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

చిన్నారికి ప్రాణం పోసిన సీఎం జగన్


తణుకులో చిన్నారిని పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్ : అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాణం పోశారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. కాలేయ సమస్యతో బాధపడుతున్న ఆచంట మండలానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి కొప్పాడి హనిని తీసుకుని తండ్రి రాంబాబు గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ కోటి మందిలో ఒకరికి వచ్చే గౌచర్ వ్యాధి కారణంగా బిడ్డ ఎదుగుదల ఉండదని, రక్తం ఉత్పత్తి ఆగిపోతుందని చెప్పారు. ఈ వ్యాధితో బాధపడుతున్న చిన్నారిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే చలించి రూ.కోటి బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రూ.1.25 లక్షల విలువైన ఇంజెక్షన్లను నెలలో మూడుసార్లు చేసేలా చికిత్స చేయిస్తున్నారని చెప్పారు. అరుదైన వ్యాధి చిన్నారికి రావడం బాధాకరమని, కానీ సీఎం జగన్ చిన్నారికి ప్రాణభిక్ష పెట్టారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి రాంబాబు మాట్లాడుతూ తమ పాపకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రాణం పోశారని, అంతేకాకుండా తన ఇద్దరు పిల్లలను ఢిల్లీ పబ్లిక్ స్కూలులో ప్రభుత్వం చదివిస్తోందన్నారు. అంతేకాకుండా పాపకు నెలకు పింఛనుగా రూ.10 వేలు జగనన్న అందిస్తున్నారని తెలిపారు. జన్మజన్మలకు జగనన్నకు రుణపడి ఉంటామన్నారు. అనంతరం మంత్రి కారుమూరి చిన్నారికి రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. వైఎస్సార్ సీపీ యువ నేత కారుమూరి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి


గూడెంలో నిరసన తెలియజేస్తున్న క్రైస్తవ జేఏసీ సంఘాలు

పెంటపాడు: మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకొనేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గూడెం క్రైస్తవ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా గురువారం ఉదయం గూడెంలోని పలు క్రైస్తవసంఘాలు, ముస్లీం మైనారిటీలు, పాస్టర్లు, గూడెంలోని ఎస్వీ రంగారావు సర్కిల్ నుంచి పోలీస్ స్టేషన్, రైల్వేస్టేషన్ రోడ్డు, శేషమహల్ రోడ్డు, ఫ్లైఓవర్ బ్రిడ్జిమీదుగా పోలీస్ ఐలండ్ వద్ద నున్న శ్రీకృష్ణదేవరాయులు, అంబేద్కర్ విగ్రహం వరకు తిరిగి టౌన్ లూథరన్ చర్చివరకు భారీ ర్యాలీ చేశారు. మణిపూర్ హింసను ఆపాలని, దేశంలో మత విద్వేషాలు లేకుండా శాంతి నెలకొనేలా చూడాలని కోరారు. క్రైస్తవులపై దాడులు అరికట్టాలని కోరారు. క్రైస్తవులపై దాడులు నివారిస్తూ, చర్చిల రక్షణ కోసం చర్యలు తక్షణం తీసుకోవాలన్నారు. మత విద్వేషాలు ప్రబలకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. ఈ ర్యాలీలో గూడెం పట్టణం, పెంటపాడు మండలం, రూరల్ గ్రామాలకు చెందిన పలువురు చర్చిల నిర్వాహకులు, గూడెం క్రైస్తవసంఘ జేఏసీ నాయకులు, ముస్లీం మైనారిటీ సభ్యులు, వివిధ కుల, మత సంఘాలకు చెందిన సభ్యులు ఈ ర్యాలీలో భారీగా పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


అత్తిలి ఎంపీడీవో కార్యాలయంలో హౌసింగ్ రివ్యూలో మాట్లాడుతున్న ఈఈ వేణుగోపాలకృష్ణ

అత్తిలి: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునే విధంగా చర్యలు చేపట్టాలని గృహనిర్మాణశాఖా ఈఈ వేణుగోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని లబ్ధిదారులకు వివరించి, సత్వరమే ఇళ్లు నిర్మించుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కేకేడీటీ వర ప్రసాద్, ఎంపీడీవో వీవీఎస్ రామారావు, పీఆర్ ఏఈ చైతన్యబాబు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ప్రత్యేక వైద్యసదుపాయం


ఫ్యామిలీ పరీక్షలలో భాగంగా రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

పెంటపాడు: ఏ విధమైన అనారోగ్యసమస్యలు వచ్చినా నెలకు రెండు సార్లు పలుకరించే ఫ్యామిలీ డాక్టర్ ఉండటం ప్రజల ఎంతో అదృష్టం. డాక్టర్ ఇంటికి వచ్చి ఉచితంగా ఫీజులు లేకుండా నాడీ పట్టి రోగం తగ్గించే వైద్యవిధానం జగనన్న ప్రభుత్వంలోనే సాధ్యమవుతుంది. ఆర్ఎంపీలు, నాటు వైద్యులను సంప్రదించే రోజులు మారాయి. దూరంలో ఉన్న పట్టణాలకు వెళ్లే పరిస్థితి లేనప్పుడు వైద్యుడే దేవుడిలా పల్లెలకు వచ్చి ప్రాణాలు నిలుపుతున్న పరిస్థితి నేడు నెలకొంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆదుకొంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ వైఎస్సార్ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా ప్రతీరోజూ సచివాలయంలో ప్రజలకు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు ఆశావర్కర్లు, వైద్యసేవలు అందిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ విధానం అమలులోకి రావడంతో వైద్యులు నెలకు రెండు సార్లు ఆయా క్లినిక్‌లను సందర్శించి ఓపీ చూసి ఆవసరమైన చోట్ల ఇళ్లకు వెళ్లి రోగులు, గర్భిణులకు వైద్యం అందిస్తున్నారు. పెంటపాడు మండలంలో 22 గ్రామాలకు గాను రెండు పీహెచ్‌సీలు ఉండగా ప్రతీ గ్రామంలోనూ వైఎస్సార్ క్లినిక్‌లు ఉన్నాయి. కొన్నింటికి సొంతభవనాలు అందుబాటులోకి రాగా మరి కొన్నింటిని సచివాలయాల్లో కొనసాగిస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ద్వారా 12 రకాల వైద్యసేవలు 14 రకాల వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు, 104 రకాల మందులు అందిస్తున్నారు. వైఎస్సార్ క్లినిక్‌లతో నిత్యం సగటున 40 మందికి వైద్యంతో పాటు, 10 మంది సుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సుస్తీ చేస్తే మంచి మందులు ఇస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


అప్పారావుపేట ఎంపీహెచ్ఎస్‌లో చిన్నారులకు కండ్ల కలక నివారణకు చుక్కల మందు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌హెచ్‌పీ వి.రూతు అన్నా రు. గురువారం మండలంలోని అప్పారావుపేట మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు దాడి చేసే అవకాశం ఉందన్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెంది వ్యాధులను కలుగజేస్తాయన్నారు. ఇంటి ఆవరణను పొడిగాను, పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం 30 మంది చిన్నారులకు కండ్ల కలక నివారణకు చుక్కల మందు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ తానుకొండ ఝాన్సీలక్ష్మీబాయి, ఆశ వర్కర్లు అడపా ప్రసన్న, సనమండ్ర వెంకటలక్ష్మి, బిళ్ళకుర్తి రాజ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ వివ.భాస్కరరావు పాల్గొన్నారు.

పట్టణ సుందరీకరణపై సమీక్ష

భీమవరం(ప్రకాశం చౌక్): నగర కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామల పలు అంశాలపై వార్డు సచివాలయం ఉద్యోగులతో సమీక్షించారు. భీమవరం పట్టణం సుందరీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, వార్డు ఇంజినీరింగ్ సెక్రటరీలతో సమీక్షించారు. అన్ని వార్డులకు సంబంధించిన పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశాలు జారీచేశారు. విస్సాకోడేరు లేఅవుట్‌కు సంబంధించి ఇళ్లను త్వరితగతిన పూర్తిచేసి ఇప్పించాలని వార్డు సెక్రటరీలకు ఆదేశాలు జారీ చేశారు. ఎంఈ పి.త్రినాథ్ రావు, డీఈ కె. అప్పలరాజు, ఏఈలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలి

పట్టణంలోని పారిశుద్ధ్యం మెరుగుదల కోసం పలు సూచనలు చేశారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి రానున్న వారం రోజుల్లో పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న క్లాప్ యూజర్ చార్జీల వసూలులో పురోగతి ఉండాలని చెప్పారు.

అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు

వీరవాసరం: శ్రీ మావుళ్ళమ్మ మహాలక్ష్మి అమ్మవార్ల హుండీ ఆదాయం లెక్కింపు గురువారం రాయకుదురులోని ఆలయ ప్రాంగణంలో నిర్వహించారని ఆలయ ఈఓ డి.వేణుగోపాల్ తెలిపారు. శ్రీ అమ్మవార్ల హుండీ ద్వారా రూ.1,22,405 ఆదాయం లభించిందన్నారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు.గ్రామ సర్పంచ్ గెద్దం భారతి, చింతపల్లి ప్రసాద్ ,పోలిశెట్టి నాగులు, వెంకటేశ్వరరావు, భాస్కరరావు, సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం తగదు


భీమవరంలో డీఎస్పీ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వ సహాయం అందడంలో సమన్వయ లోపం కారణంగా తీవ్ర జాప్యం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సెల్ సభ్యురాలు జి.సత్యసుధామ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం భీమవరం డీఎస్పీ బండారు శ్రీనాథ్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 306 ఐపీసీ 3(2) ఎస్సీ, ఎస్టీ పీవోఏ యాక్టుతో నమోదైన కేసుకు ప్రభుత్వ నష్టపరిహారం వస్తుందని పోలీసుశాఖ తెలుపుతుంటే ఈ సెక్షన్‌కు పరిహారం రాదని కలెక్టర్ కార్యాలయంలో చెబుతున్నారని సత్యసుధామ ఆందోళన వ్యక్తం చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

ఉండి: ఉండి మండలం యండగండి శివారు ఖండ్రికగూడెంలో ఓ మైనర్ బాలిక అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేసారు. అత్తిలి మండలం గుమ్మంపాడుకు చెందిన బాలిక 15 రోజుల క్రితం ఖండ్రికగూడెంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. గత నెల 29న ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి షాపు వద్దకు సరుకులు తెచ్చేందుకు బయటకు వెళ్ళిన బాలిక కనిపించకపోవడంతో బంధువులు, తెలిసిన వారందరి వద్ద ఆచూకీ కోసం ప్రయత్నించారు. దీంతో యువతి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై కే గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.